


కాలనీలో నీవానది నీళ్లు




నీవానది ప్రవాహం నుంచి స్థానికులను రక్షిస్తున్న రెస్క్యూ టీమ్

తగ్గని నీవా ఉధృతి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలతో పాటు చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు నీవానది పొంగిపొర్లుతోంది. రెండు రోజులుగా నీవానది ఉధృతంగా ప్రవహించడంతో స్థానికంగా కాలనీలు జలది గ్బంధంలో చిక్కుకున్నాయి. తేనబండ, వీరభద్రకాలనీ, రిక్షాకాలనీ, కైలాసపురం, రాజుగుడివీధి తదితర కాలనీలు వరదనీటితో మునిగిపోయాయి. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలక అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు రెస్క్యూ టీములతో సహాయక చర్యలు చేపడతున్నారు. సోమవారం చిత్తూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జీ విజయానందరెడ్డి, ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ముంపునకు గురైన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం బాధితులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. 40,41వ డివిజన్ల నేతలు పీఎస్ చందు, భువనేశ్వరిల ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. మాజీ సీకేబాబు తనయుడు సాయికృష్ణారెడ్డి, ఇతర పార్టీ నేతలు ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించి అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు.

తిరుమలలో కృతి


నటి కృతిశెట్టి సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆమెను చూసేందుకు.. సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఎగబడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

● సదరన్ డిస్కం నూతన సీఎండీ శివశంకర్

తిరుపతి, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని నూతన సీఎండీ లోతేటి శివశంకర్ అన్నారు. తిరుపతిలోని డిస్కం ప్రధాన కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యుత్ రంగంలో సంస్కరణలను వేగంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలను నెరవేర్చడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా ఉన్న గ్రామాలను త్రీ ఫేజ్‌కు మార్చడం, ఆర్‌డీఎస్ఎస్ స్కీం అమలు చేయడం కీలక బాధ్యతలుగా భావిస్తున్నట్లు తెలిపారు. రెన్యువబుల్ ఎనర్జీ అయిన సూర్యఘర్ వంటి పథకాల అమలును వేగవంతం చేస్తామన్నారు. విద్యుత్ సరఫరాలో, సేవల్లో, విద్యుత్ నాణ్యతపై ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తక్షణం స్పందించి పరిష్కరించేలా యంత్రాంగం పనితీరును మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు. డిస్కంలో ఖాళీ పోస్టుల భర్తీ విషయమై ప్రభుత్వం సమీక్షిస్తోందని, త్వరలో ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్నారు. 'స్మార్ట్ మీటర్ల ఏర్పాటు మంచిది. ఎంతో అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల్లోనూ వీటిని వాడుతున్నారు. ఈ మీటర్ల వల్ల రీడింగ్ కచ్చితంగా తెలుస్తుంది. ఇళ్లయినా, షాపైనా, పరిశ్రమలోనైనా ఎంత లోడ్ ఉందో తెలుస్తుంది. ఆ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా సరఫరాను మరింత మెరుగుపరచడానికి అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు వద్దు' అని సూచించారు.



సీఎండీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి: ఏపీ సదరన్ డిస్కం సీఎండీగా ఎల్.శివ శంకర్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతిలోని ప్రధాన కార్యాలయానికి ఉదయం 10.30 గంటలకు ఆయన చేరుకోగా.. పూర్వపు సీఎండీ కె.సంతోషరావు స్వాగతం పలికారు. పూజల అనంతరం పూర్వపు సీఎండీ బాధ్యతలు అప్పగించారు. సంస్థ డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, రామమోహన రావుతో పాటు సీజీఎంలు, జీఎంలు, తిరుపతి సర్కిల్ ఎస్ఈ వి.చంద్రశేఖర్‌రావు, పలువురు ఎస్ఈలు, ఈఈలు, డీఈఈలు, ఏఈలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు యువతకు పోటీలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15న యువతకు పలు అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఆర్‌వీఎస్ నగర్‌లో ఎస్వీ సెట్ కళాశాలలో పోటీలు జరుగుతాయన్నారు. కూచిపూడి, జానపద నృత్యం (సోలో), వెస్టర్న్ డ్యాన్స్ (గ్రూప్) ఉంటాయన్నారు. అభ్యర్థులు సొంత ఖర్చులతో పాల్గొనాల్సి ఉంటుంది. 15 - 29 సంవత్సరాల మధ్య వయసున్న యువతీయువకులు మాత్రమే పాల్గొనాలన్నారు. జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన విజేతలకు ప్రయాణ, భోజన వసతి సదుపాయాలు జిల్లా యువజన సర్వీసుల శాఖ అందజేస్తుందన్నారు.

గంగాధరనెల్లూరు మండలంలో కుండపోత

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వర్షం జిల్లాప్రజలను ఇబ్బందులపాల్జేస్తోంది. గడచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 21 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా గంగాధరనెల్లూరు మండలంలోన 108.4 మి.మీ, అత్యల్పంగా గుడుపల్లి, నగరిలలో 1.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మండలాల వారీగా గుడిపాలలో 86.4, చిత్తూరు అర్బన్‌లో 40.2, చిత్తూరు రూరల్‌లో 38.4, పెనుమూరులో 25.8, శ్రీరంగరాజపురంలో 21.8, యాదమరిలో 21.4, తవణంపల్లెలో 18.2, బంగారుపాళ్యంలో 9.2, పులిచెర్లలో 9.0, పూతలపట్టు, రొంపిచెర్ల మండలాల్లో 6.4, సదుంలో 4.6, రామకుప్పంలో 4.0, బైరెడ్డిపల్లిలో 3.2, పలమనేరులో 2.8, వి.కోట, గంగవరం మండలాల్లో 2.4, కుప్పంలో 1.4 మి.మీ. వర్షపాతం నమోదయింది.

పిడుగుపాటుకు విద్యార్థి మృతి

చిత్తూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు ఓ విద్యార్థి మృతిచెందాడు. జంగాలపల్లి గ్రామానికి చెందిన చిట్టిబాబునాయుడు కుమారుడు లతీష్‌కుమార్(20) చిత్తూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో ఇంటి మిద్దెపైకి వెళ్లిన లతీష్‌కుమార్‌పై పిడుగు పడి ంది. దీంతో అక్కడిక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయమైనా లతీష్‌కుమార్ కనపడక పోవడంతో కుటుంబ సభ్యులు మిద్దెపై వెతికారు అక్కడ విగత జీవుడిగా కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. తహసీల్దార్ జయప్రకాష్, పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు.


పిడుగుపడి మృతి చెందిన లతీష్‌కుమార్

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

చిత్తూరు లీగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ యువకుడికి 20ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం సోమవారం తీర్పు వెల్లడించింది. మదనపల్లెకు చెందిన పుట్టా ప్రసాద్ 2021 మార్చి 3న తన సమీప బంధువైన 13 ఏళ్ళ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. స్కూటర్‌పై బలవంతంగా తీసుకుని మదనపల్లి - పుంగనూరు బైపాస్ రోడ్డులోని ఎగువచెరువుకుంట వద్ద గల గుట్ట దగ్గరకు తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఇంటికి చేరిన బాధిత బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వీరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని రిమాండ్‌కు తరలించారు. సోమవారం చిత్తూరులోని పోక్సో కోర్టు కేసు పూర్వాపరాలను విచారించింది. పుట్టా ప్రసాద్‌కు 20ఏళ్ల జైలు, రూ.8 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శంకర్‌రావు తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.లక్ష పరిహారం ప్రభుత్వం తరపున చెల్లించాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి వాదించారు.


నిందితుడు ప్రసాద్

ధర్నాకు వెళుతూ మృత్యుఒడిలోకి..

మినీ బస్సు బోల్తా పడి ట్రాన్స్‌కో ఉద్యోగి మృతి ● ఆరుగురికి తీవ్రగాయాలు


బోల్తాపడిన వాహనం






మృతుడు చరణ్‌కుమార్ (ఫైల్ ఫొటో) - క్షతగాత్రులు

పలమనేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో తలపెట్టిన విద్యుత్‌శాఖ ఉద్యోగుల ధర్నాకు పలమనేరు ప్రాంతం నుంచి మినీబస్సులో వెళ్తుండగా సోమవారం వేకువజామున ప్రకాశం జిల్లా టంగుటూరి మండలం వద్ద వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగవరం మండలం పత్తికొండ గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మన్ గ్రేడ్-2 సి.చరణ్‌కుమార్ మృతిచెందగా.. మరో ఆరుగురు ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే 13 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకోగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొని కాలువలో బోల్తా పడింది. గంగవరం మండలం పత్తికొండ గ్రామానికి చెందిన సి.చరణ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా..లైన్ ఇన్‌స్పెక్టర్ సుహేల్,లైన్‌మన్ రామ్మోహన్, శ్రీనివాస నాయక్,ప్రసాద్‌బాబు,జూనియర్ లైన్‌మన్ గ్రేడ్-2 బాలసుబ్రహ్మణ్యం, రాజేష్, దినేష్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు, ఒంగోలు టూటౌన్ సీఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సహకారంతో బస్సు నుంచి గాయపడ్డ వారిని బయటకు తీశారు. 108 వాహనంలో ఒంగోలులోని ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం రామ్మోహన్, బాలసుబ్రహ్మణ్యం, రాజేష్‌లను తిరుపతికి తరలించగా.. శ్రీనివాస నాయక్, ప్రసాద్ బాబులను వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. పలమనేరు ఏడీఈ జీవన్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి ఒంగోలుకు వెళ్లి క్షతగాత్రులను పరామర్శించడంతో పాటు వారి కుటుంబసభ్యులకు ధైర్యం చెబుతూ మెరుగైన చికిత్స కోసం వారు కోరిన ఆస్పత్రులకు పంపి చికిత్సలు అందిస్తున్నారు.

తండ్రీ కొడుకులు

ఒకే పాఠశాలలో టీచర్లు

వాళ్లు తండ్రీ కొడుకులు. స్కూల్ అసిస్టెంట్లు. అందులోనూ ఒకటే స్కూల్. ఈ అరుదైన ఘటనకు వేదికైంది చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల. ఆ తండ్రీ కొడుకులు మునగల రవీంద్రుడు, హరిప్రసాద్. వీరికి తిరుపతి రూరల్ ఓటేరు శ్రీవారినగర్. ఇప్పటికే రవీంద్రుడు తెలుగు భాషా ఉపాధ్యాయుడిగా ఆ పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈయన కుమారుడు ఇటీవల జరిగిన డీఎస్సీ ద్వారా ఫిజికల్ సైన్స్ టీచర్ (స్కూల్ అసిస్టెంట్)గా ఉద్యోగం సాధించారు. శుక్ర, శనివారాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో హరిప్రసాద్ చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే పోస్టింగ్ పొందారు. తండ్రి పనిచేస్తున్న పాఠశాలలోనే సోమవారం విధుల్లో చేరారాయన. 'ఉపాధ్యాయ ఉద్యోగం రావడమే అదృష్టమనుకుంటే.. మా నాన్నతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం ఎంతో ఆనందాన్నిస్తోంది. ఇది శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీర్వాదమే. ఉపాధ్యాయుడినై మా నాన్న కలను నెరవేర్చే అవకాశాన్ని మెగా డీఎస్సీ ద్వారా విద్యాశాఖ మంత్రి లోకేశ్ కల్పించారు. మా నాన్న అడుగుజాడల్లో నడిచి.. మంచి ఉపాధ్యాయుడిగా పేరు తెచ్చుకుంటా. విద్యార్థుల ఉన్నతికి కృషిచేస్తా' అని హరిప్రసాద్ ఆనందంగా చెప్పారు.



- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

నేటి నుంచి ఉమ్మడి జిల్లా క్రీడా జట్ల ఎంపిక

చిత్తూరు క్రీడలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అండర్-19 స్కూల్ గేమ్ పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జూడో, 15న మదనపల్లిలోని సీటీఎం జడ్పీ పాఠశాలలో బ్యాస్కెట్‌బాల్, హాకీ, నెట్‌బాల్, హ్యాండ్ బాల్ బాలబాలికల విభాగంలో జరుగుతాయన్నారు. 16న పలమనేరులోని జడ్పీ పాఠశాలలో వాలీబాల్, బీచ్ వాలీబాల్ క్రీడల్లో బాలబాలికల విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు జనవరి 1 2007 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. 10వ తరగతి మార్కులిస్ట్, ఒరిజినల్ ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

శ్రీవారి సేవలో సినీ ప్రముఖులు



లక్ష్మీప్రణతి, నార్నె నితిన్ దంపతులు- ఏక్తా కపూర్ - వెంకీ కుడుముల

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. హీరోయిన్ కృతిశెట్టి, దర్శకుడు వెంకీ కుడుముల, జూనియర్ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీప్రణతి, ఆమె సోదరుడు, హీరో నార్నె నితిన్ దంపతులు, బాలీవుడ్ సినీనిర్మాత ఏక్తాకపూర్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

కొత్త టీచర్లొచ్చారు

నూతన ఉపాధ్యాయుల రాకతో జిల్లాలోని పాఠశాలలు సోమవారం కళకళలాడాయి. మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి జిల్లాలో ఎంపికైన వారిలో 1,394 మంది ఉపాధ్యాయులు పోస్టింగ్ పొందారు. వీరంతా కౌన్సెలింగ్ ద్వారా తమకు కేటాయించిన పాఠశాలల్లో సోమవారం విధులకు హాజరయ్యారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కలిసి అపాయింట్‌మెంట్ లెటర్స్ అందజేసి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారు. మొదటిరోజు కావడంతో సీనియర్లు నూతన ఉపాధ్యాయులను పరిచయం చేసుకుని విధుల గురించి సూచనలు చేశారు.



తిరుపతిలోని ఎంజీఎం పాఠశాలలో చేరేందుకు..

పాఠశాల నిర్వహణకు సంబంధించిన అంశాలను విశదీకరించారు.

– తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి

సర్వ దర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు

ఆదివారం శ్రీవారిని

దర్శించుకున్న భక్తులు: 84,424

తలనీలాలు సమర్పించినవారు: 36,711



మా మొర ఆలకించండి మహాప్రభో..!

పీజీఆర్ఎస్‌లో అర్జీదారుల వేడుకోలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): 'మా మొర ఆలకించి సమస్యలు పరిష్కరించండి మహాప్రభో' అంటూ అర్జీదారులు అధికారులను వేడుకున్నారు. కలెక్టరేట్ వేదికగా సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 290 వినతులు అందగా, అందులో రెవెన్యూ శాఖకు 162 వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రజల సమస్యలను సావధానంగా విన్నారు. వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. డీఆర్వో నరసింహులు, ఎస్డీసీలు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్ సుధారాణి పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు



మా భూమిని కబ్జా చేశారు..

నేను గూడూరులో చెప్పులు కుట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. తడ మండలం తడ కండ్రిగ గ్రామంలో ప్రభుత్వం 31 సెంట్ల మెట్టభూమి ఇచ్చింది. దీన్ని కొందరు ఆక్రమించారు. అడిగితే దౌర్జన్యం చేస్తున్నారు. సర్వేకు పలు దఫాలు చలానా కట్టినా హద్దులు కూడా చూపించడంలేదు. కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయాను. మీరైనా న్యాయం చేయండి.

– చంద్రయ్య, తడకండ్రిగ, తడ మండలం



మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలి

మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిలా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ మాట్లాడుతూ 138జీవో ప్రకారం పారిశుధ్య, సెక్యూరిటీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పోను రూ.16వేలు, సూపర్‌వైజర్లకు రూ.18,600 వేతనం ఇవ్వాల్సి ఉండగా అరకొరగా ఇస్తూ దోపిడీ చేస్తున్నారన్నారు. వారికి డీఎంహెచ్‌వో సంతకంతో కూడిన గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ రవి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఉదయ్‌కుమార్, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు నరసింహులు, కిషోర్, వరలక్ష్మి, పద్మ, నాగభూషణం, సుశీల, సులోచన, వనజ, సునీల్, పార్వతి పాల్గొన్నారు.

మా పొలాన్ని ఆక్రమించారు.. న్యాయం చేయండి



తొట్టంబేడు మండలం శ్రీకృష్ణాపురం గ్రామ పరిధిలో 40ఏళ్లుగా ఐదు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. డీకేటీ పట్టా కూడా ఉంది. రెవెన్యూ అధికారులు మా పాసుపుస్తకాన్ని మరొకరికి ఇచ్చారు. దీనిపై పలుమార్లు అడిగినా సమాధానం చెప్పలేదు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మా భూమిలోకి ప్రవేశించి హద్దులు చెరిపేశారు. మేము పొలం వద్దకు వెళితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. కోర్టుకు కూడా వెళ్లాం. కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశాం. లాభం లేకపోయింది. స్థానిక రెవెన్యూ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారు. కబ్జాదారులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయండి. లేకపోతే చావు ఒక్కటే మాకు మార్గం.

– వీరాస్వామి, అమరావతి దంపతులు, శ్రీకృష్ణాపురం, తొట్టంబేడు మండలం

పెండింగ్ వ్యవసాయ భూములకు ప్రొసీడింగ్స్ మంజూరు చేయండి

శెట్టిపల్లెలో పెండింగ్‌లో ఉన్న 30 ఎకరాల వ్యవసాయ భూములకు ప్రొసీడింగ్స్ మంజూరు చేయాలని ఆ గ్రామ రైతులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2018లో అప్పటి కలెక్టర్ చెప్పిన విధంగా శెట్టిపల్లె గ్రామం ఉత్తరం వైపు, చెరువుకు తూర్పు వైపున సప్లై చానల్‌కు దక్షిణం వైపున ప్లాట్స్ అలాట్‌మెంట్ చేసి రైతులకు ఇవ్వాలన్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా అలాట్‌మెంట్ చేసే ప్లాట్లను మినిమం సైజు ద్వారా ఇవ్వాలన్నారు. శెట్టిపల్లె గ్రామంలో తుడా మాస్టర్‌ప్లాన్ రోడ్డును కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు బత్తినిబాబు, జయరామయ్య, చెంగయ్య పాల్గొన్నారు.



సీజేపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నేతలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దేవదాసు, వాసుదేవరావు, మధు, గోపి, అరుణ, రవి డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు.



దివ్యాంగుల పింఛను ఇప్పించండి

మేము ముగ్గురం ఆడపిల్లలం. తండ్రి మరణించాడు. 90శాతం వికలాంగత్వం ఉంది. ఏ పనీ చేయలేను. దివ్యాంగుల పింఛన్ ఇప్పించి ఆదుకోండి.

– సత్యవతి, ఎల్లమండ్యం, రేణిగుంట మండలం

ఒక్క నిర్ణయం.. ఎందరికో జీవితం

● నూతన ఉపాధ్యాయుల్లో వెల్లివిరిసిన ఆనందం

తిరుపతి(విద్య), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బీఈడీ చేశారు. డీఎస్సీ కోసం ఆరేళ్లకుపైగా ఎదురు చూశారు. కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహించాలన్న నిర్ణయం.. ఉమ్మడి జిల్లాలోని 1403 మంది జీవితాల్లో వెలుగు నింపింది. వీరిలో 1394 మంది పోస్టింగ్ ఆర్డర్లు పొందారు. సోమవారం బడుల్లో చేరారు. ఈ సందర్భంగా తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు.

నా తల్లిదండ్రుల కాయకష్టానికి ఫలితం



మాది పేద దళిత కుటుంబం. ముగ్గురు ఆడపిల్లలో రెండో అమ్మాయిని. నా తల్లిదండ్రులు పద్మమ్మ, గున్నయ్య కూలి పనులుచేస్తూ చదివించారు. పేదరికం నుంచి బయటపడేందుకు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. మెగా అవకాశాన్ని వదులుకోకూడదని కష్టపడ్డా. డీఎస్సీలో 76.57 మార్కులు సాధించి సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. చిత్తూరు జిల్లా వి.కోట మండలం కుదువగడ్డ ప్రాథమిక పాఠశాలలో చేరా. ప్రభుత్వం కల్పించిన అవకాశం.. మా తల్లిదండ్రుల కాయకష్టానికి ఫలితం ఈ ఉద్యోగం.

– టి.భవాని, కమ్మకొత్తూరు, శ్రీకాళహస్తి మండలం

తల్లిదండ్రులకే అంకితం



మా తల్లిదండ్రులు జానకమ్మ, రాధాకృష్ణ వ్యవసాయంతో జీవనం సాగించేవారు. నన్ను ఎంతో ప్రోత్సహించారు. మెగా డీఎస్సీలో అర్హత పొందిన నేను ఎస్టీటీలో జిల్లాలో 24వ ర్యాంకు, ఎస్ఏ సోషల్ 67వ ర్యాంకు, టీజీటీ సోషల్ 77వ ర్యాంకు, టీజీటీ తెలుగులో 31వ ర్యాంకు సాధించా. నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా చేరా. ఎన్ని ఇబ్బందులున్నా నాకు ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఈ ఉద్యోగాన్ని అంకితం చేస్తున్నా.

– నల్లపాటి శివకుమార్, గోవిందప్పనాయుడు కండ్రిగ, బీఎన్‌కండ్రిగ మండలం

అత్యంత ఆనందం



మాది పేద దళిత కుటుంబం. బీకామ్, బీఈడీ చేశా. నా తల్లిదండ్రులు బొగ్గల ఆదెయ్య, వేమక్కకు పొలం పనుల్లో చేదోడు వాదోడుగా ఉన్నా. మెగా డీఎస్సీ ప్రకటనతో కోచింగ్ లేకుండానే కష్టపడి సన్నద్ధమయ్యా. రాయలసీమ జోన్ పరిధిలో 67.1028 మార్కులతో టీజీటీ సోషల్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యా. రేణిగుంట మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విధుల్లో చేరా. అన్ని వృత్తుల్లోకి పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తి లభించడం నా ఆనందం.

– ప్రతాప్, ఎన్టీఆర్ నగర్, బుచ్చినాయుడు కండ్రిగ మండలం

మెగా డీఎస్సీ జీవితాన్నిచ్చింది



మాది నిరుపేద దళిత కుటుంబం. మెగా డీఎస్సీలో 75.46 మార్కులతో సాధించి సెకండరీగ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యా. శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరా. చిన్న వయసులోనే తండ్రి వీరయ్యను కోల్పోయా. కష్టపడి నన్ను చదివించిన తల్లి మెరుంవాణి కూడా ఏడాది కిందట చనిపోయింది. మెగా డీఎస్సీ నాకు జీవితాన్నిచ్చింది.

– లావణ్య, చిన్నసింగమాల, తొట్టంబేడు మండలం

రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మా నాన్న ఫిజికల్ డైరెక్టర్ మస్తానయ్య. తల్లి కళావతి. గత డీఎస్సీలో ఉద్యోగం సాధించలేకపోయాను. మెగా డీఎస్సీ ప్రకటించగానే ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివా. మెగా డీఎస్సీలో 83.03 మార్కులు సాధించి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగం సాధించా. బుచ్చినాయుడు కండ్రిగ మండలం తలారివెట్టు ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరా. మా నాన్నను ప్రేరణగా తీసుకుని ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించి నా ఆనందానికి కారణమైన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– పవన్‌కుమార్, కాంపాళెం, బీఎన్ కండ్రిగ మండలం

అంతరిక్ష ప్రయోగాలతో మానవాళి శ్రేయస్సు

● షార్ డైరెక్టర్ పద్మకుమార్




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడతాయని షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ అన్నారు. సోమవారం సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 63 ఏళ్లలో ఇస్రో గణనీయమైన ప్రగతి సాధించిందన్నారు. ఇతరదేశాలకు సైతం ఉపగ్రహ సాంకేతికతను అందించే స్థాయికి ఎదిగిందన్నారు. వాతావరణం, ఆహార భద్రత, దేశరక్షణ, మత్స్య సంపద ఉనికి, అడవుల పరిరక్షణ, టెలీ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ విభాగాల్లో ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు సమర్థంగా పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇస్రోఆధ్వర్యంలో 'యువిక'లాంటి కార్యక్రమాలతో పాటు ఇంటర్న్‌షిప్ ప్రాజెక్టుల ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. అంతరిక్ష వారోత్సవాల్లో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ ప్రిన్సిపాల్, కమాండెంట్ రాజేష్ కుమార్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ ముత్తు చెలియన్, కంట్రోలర్ జి.రమేష్ బాబు, ఎంఎస్‌ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, వాల్ఫ్ డీడీ శంకరన్, రమణారెడ్డి, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న టిప్పర్

● మాజీ సర్పంచ్ సురేంద్రనాయుడి మృతి



రామచంద్రాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం రామాపురం సమీపంలో సోమవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో మాజీ సర్పంచి సురేంద్ర నాయుడు(60) అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. రామచంద్రాపురం మండలం కొత్తకండ్రిగకు చెందిన లెక్కల సురేంద్ర నాయుడు తన పొలంలో కూరగాయలను తిరుపతి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తుంటారు. సోమవారం ఉదయం 5గంటలకు తిరుపతిలో విక్రయించి ఇంటికి బయలుదేరారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో రామాపురం సమీపంలోని విల్లాస్ వద్ద వస్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే ఆయన మృతిచెందారు. ఎస్ఐ భక్తవత్సలం, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరంతర సాధనతో లక్ష్యాల ఛేదన

● 'కళాచిత్ర' పురస్కారాల ప్రదానోత్సవంలో కలెక్టర్



విద్యార్థులకు కళాచిత్ర పురస్కారం అందజేస్తున్న శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిరంతరం సాధన చేస్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం 'కళాచిత్ర' పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. గతేడాది పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన రామిశెట్టి మౌనిక, జి.కీర్తి, వేలూరు చేతనకు కలెక్టర్‌తో పాటు శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి కలిసి కళాచిత్ర ట్రస్టు అందించే పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పేదరికాన్ని జయించడంతో పాటు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్రరెడ్డి మాట్లాడుతూ కళాచిత్ర కుటుంబ సభ్యులు తాము చదివిన పాఠశాలలో విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. వచ్చే ఏడాది నుంచి కళాచిత్రతో పాటు శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలోనూ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తామన్నారు.

మూడో కన్ను పుస్తకావిష్కరణ: రచయిత, ఆంధ్రజ్యోతి పూర్వ విలేకరి ఆర్ఎంవీ భాస్కర్‌బాబు రచించిన మూడో కన్ను పుస్తకాన్ని కలెక్టర్, శ్రీసిటీ ఎండీ ఆవిష్కరించారు. ఆరుపదుల వయస్సులో ఇలాంటి మంచి పుస్తకాన్ని రచించారంటూ రచయితను అభినందించారు. ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంఈవో సునీల తదితరులు పాల్గొన్నారు.



గిరీష్మసైనిరెడ్డి



విష్ణుప్రియ



పర్ణితయాదవ్



కె.శుభశ్రీ



రుక్సార్‌తబ్సుమ్

ఆంధ్రా ఉమెన్ టి20 క్రికెట్ జట్టుకు జిల్లా నుంచి ఐదుగురు


తిరుపతి(క్రీడలు), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్ 19 ఉమెన్స్ టీ20క్రికెట్ జట్టులో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఐదుగురు మహిళా క్రీడాకారులకు స్థానం లభించింది. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవలె నిర్వహించిన ఎంపిక పోటీలలో తిరుపతికి చెందిన ఎం.గిరీష్మసైనిరెడ్డి(వైస్‌కెప్టెన్), కె.శుభశ్రీ, ఎ.విష్ణుప్రియ, ఎం.పర్ణితయాదవ్, వాయల్పాడుకు చెందిన ఎం.రుక్సార్‌తబ్సుమ్ సత్తాచాటారు. దీంతో వీరి ఎంపికపై సెలెక్టర్లు మొగ్గుచూపారు. ఈ ఐదుగురిలో ఒకరికి వైస్‌కెప్టెన్ బాధ్యతలు అప్పగించడం విశేషం. ఈ నెల 20నుంచి 23వరకు తెలంగాణలోని ఔరంగాబాదు జరగనున్న అండర్ 19ఉమెన్స్ టీ20చాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరిని ఏసీఏ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్ తదితరులు అభినందించారు.

పళ్లికొండేశ్వర ఆలయంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి విచారణ

నాగలాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వరాలయంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి సోమవారం మధ్యాహ్నం నూతన పాలక మండలికి సంబంధించి విచారణ చేపట్టారు. గత శుక్రవారం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం జరిగిన విషయం తెలిసిందే. ఈ పాలక మండలి ఏర్పాటైన రెండు రోజుల్లోనే ఇద్దరు ప్రధాన సభ్యుల నేర చరిత్రపై, ఆలయ ఈవో లతపై దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు అందినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లా దేవదాయ శాఖ అధికారి రామకృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఫణిరాజ శయన సోమవారం పళ్లికొండేశ్వర ఆలయ కార్యాలంలో పాలకమండలి సభ్యుల నేర చరిత్రపై ఆలయ ఈవోతో చర్చించినట్లు తెలిసింది. అలాగే వీరి నేర చరిత్రకి సంబంధించిన సమగ్ర వివరాలను దేవాదాయశాఖ అధికారులకు ఎందుకు సమర్పించలేదని ఈవోను ప్రశ్నించినట్లు తెలిసింది. వీరి నేర చరిత్రలకు సంబంధించిన జిరాక్స్ కాపీలను తమతో తీసుకెళ్లినట్లు సమాచారం.

నకిలీ మద్యంపై అసత్య ప్రచారం

పోలీసుల అదుపులో ఇద్దరు వైసీపీ నాయకులు



నవీన్

తిరుపతి(నేర విభాగం), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం పేరిట ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారంచేసి, ప్రజలను తప్పుదారి పట్టించారంటూ ఇద్దరు వైసీపీ నేతలను తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిలో తిరుపతి వైసీపీ ఉత్తర విభాగం అధ్యక్షుడు, భూమన అభినయ్ అనుచరుడు నవీన్, అతడి అనుచరుడు వెంకటేష్‌ను అలిపిరి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, అభినయ్, వైసీపీ శ్రేణులు అలిపిరి స్టేషన్‌కు వచ్చారు. ఏ కారణంతో.. ఏ కేసు కింద వారిని అదుపులోకి తీసుకున్నారని పోలీసులను భూమన ప్రశ్నించారు. దీంతో కాసేపు అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. డీఎస్పీ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా, మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించడానికి పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

బాలుడి కాలేయ సమస్యపై ఆరా

● నివేదిక అందజేయాలని చైల్డ్ కౌన్సిలర్‌కు మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ ఆదేశం



బాలయ్యకొత్తూరులో బాలుడు వెంకటేష్ ఇంటివద్ద వివరాలు సేకరిస్తున్న డీసీపీయూ కౌన్సిలర్ ఉష

గంగాధరనెల్లూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బాలయ్యకొత్తూరు గ్రామానికి చెందిన బాలుడు వెంకటేష్‌కు లివర్ సమస్యపై అధికారులు కదిలారు. నా బిడ్డను కాపాడండి అనే శీర్షికన సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనానికి స్పందించారు. గ్రామానికి చెందిన సీతూ, నరసింహారెడ్డి దంపతుల పదేళ్ల కుమారుడు వెంకటేష్ కాలేయ సమస్యతో తీవ్ర అనారోగ్యం బారిన పడిన వైనాన్ని తెలుసుకుని జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ పీడీ వెంకటేశ్వరి చైల్డ్ డీసీపీయూ కౌన్సిలర్ ఉషను తక్షణమే గ్రామానికి వెళ్లాలని ఆదేశించారు. ఆమె సచివాలయం అధికారులతో కలిసి వెంకటేష్ ఇంటికి వెళ్లి అనారోగ్య సమస్య గురించి ఆరా తీశారు. వైద్యపరీక్షల రికార్డులను పరిశీలించారు. వీటన్నింటినీ పరిశీలించాక జిల్లా మహిళాశిశు సంక్షేమశాఖ పీడీకి నివేదిక అందజేయనున్నట్లు ఉష తెలిపారు. తూగుండ్రం టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు నీరజాక్షులురెడ్డి, ప్రధానకార్యదర్శి సంపత్, ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి శిరీష, మహిళా పోలీస్ జయశ్రీ, వెల్ఫేర్ అసిస్టెంట్ జనార్దన్, లోకేశ్వరి పాల్గొన్నారు.

సర్వేయర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ, ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత అసిస్టెంట్ సర్వేయర్ శిక్షణకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి తెలిపారు. అభ్యర్థులు కనీస విద్యార్హతలు ఐదో తరగతి ఆపై చదివి 18 సంవత్సరాలు నిండిన వారై ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 97047 62155 నెంబరును సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల ధర్నా



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట పీహెచ్‌సీ వైద్యులు ధర్నా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 13 రోజులుగా విధులు మానేసి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా న్యాయమైన కోరికలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



ద్విచక్రవాహనాలను, నిందితుడ్ని చూపుతున్న పోలీసులు

బంగారుపాళ్యం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను కాజేస్తున్న దొంగ పట్టుబడ్డాడు. పోలీసుల కథనం మేరకు... తగ్గువారిపల్లెలో గత శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట పార్క్ చేసిన ద్విచక్రవాహనాలు చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దర్యాప్తులో భాగంగా సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం నలగాంపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. తొలుత పొంతనలేని సమాధానాలు చెప్పాడు. తర్వాత గట్టిగా విచారించేసరికి తగ్గువారిపల్లెలో ద్విచక్రవాహనాల దొంగతనానికి పాల్పడింది తానేనని అంగీకరించాడు. నిందితుడు బంగారుపాళ్యం మండలం బండ్లదొడ్డి గ్రామానికి చెందిన కోటేశ్వరరావుగా తేలింది. గతంలో కూడా ఇతను కాణిపాకం,ఆర్‌సీపురం ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడడంతో కేసులు నమోదయ్యాయి. ఇతడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితుడ్ని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

కలెక్టరేట్‌కు 364... పోలీసుశాఖకు 34 అర్జీలు

● సమస్యలను పరిష్కరించాలని బాధితుల వేడుకోలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో 364 మంది బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రెవెన్యూ, సర్వేశాఖకు 258, డీఆర్‌డీఏకు 25, పోలీసుశాఖకు 15, పశు సంవర్థకశాఖకు 7, డీపీవోకు 6, డీఎస్‌వోకు సంబంధించి 5 అర్జీలను అందజేశారు. డ్వామా, ఎంప్లాయిమెంట్, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు, వికలాంగుల సంక్షేమశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, డీఎఫ్‌వో, పంచాయతీరాజ్‌శాఖలకు 48 అర్జీలు అందాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ తుషార్ డూడీ బాధితుల నుంచి వినతిపత్రాలను తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 34 మంది వినతిపత్రాలను అందించారు.

● నేషనల్ హైవే అధికారులు మూసివేసిన రోడ్డును యధాతథంగా తమ అవసరాల మేరకు కొనసాగించాలని ఎస్‌ఆర్‌పురం మండలం నరసింహాపురం గ్రామస్తులు కోరారు. దారిలేక పొలాలకు, ఇతర గ్రామాలకు వెళ్లలేకపోతున్నామన్నారు.

●ఆక్రమణదారుల నుంచి తన భూమిని కాపాడాలని జీడీ నెల్లూరు మండలం వడ్డేపల్లెకు చెందిన వెంకటేశ్ కోరాడు. తూగుండ్రం లెక్కదాఖలా సర్వే నెంబరు 178-2లో తన భూమి ఉందన్నారు. దస్తావేజులు తన వద్ద ఉన్నా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నాడు.

● తన ఆటో ద్వారా అంగన్‌వాడీ సరుకులను రవాణా చేసే అవకాశం కల్పించి, ఆదుకోవాలని సోమల మండలం దిడ్డివారిపల్లెకు చెందిన సుగుణమ్మ కోరారు. 2023లోడ్వాక్రాగ్రూపు ద్వారా కొనుగోలు చేసినా ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నానని వాపోయింది

● సదరం ధ్రువపత్రాల పున:పరిశీలన ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని జిల్లా దివ్యాంగ సంఘాల జేఏసీ నేత చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. దూర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న శిబిరాలకు దివ్యాంగులు హాజరుకాలేకపోతున్నారన్నారు

● కాణిపాకం పంచాయతీ ఆస్తుల పరిరక్షణపై మండల అధికారులు చర్యలు చేపట్టేలా ఆదేశించాలని మాజీ సర్పంచ్ గోపీనాథ్ వినతిపత్రాన్ని అందజేశారు.

● సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంఆర్‌పీఎస్ నేతలు చెప్పారు. గవాయికి జరిగిన అవమానానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ తుషార్ డూడీ

● మున్సిపల్ పారిశుధ్యం, ఇంజనీరింగ్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె తప్పదని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు నాగరాజన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు కార్మికులతో కలిసి నిరసన తెలిపారు.

● నేషనల్ హైవే పక్కనే మురికి నీళ్లు, వర్షపు నీరు వెళ్లడానికి కాలువను ఏర్పాటు చేయాలని 21వ వార్డులోని లక్ష్మయ్యవూరు ప్రజలు కోరారు. రోడ్డు పైభాగం నుంచి మురికినీరు, వర్షపునీరంతా కాలువలు లేని కారణంగా గ్రామంలోకి వస్తుందన్నారు. మురుగు కాలువ లేదా పైపులైన్‌ను ఏర్పాటు చేయాలన్నారు.





కాణిపాకం పంచాయతీ ఆస్తుల పరిరక్షణపై మండల అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టరేట్‌కు వచ్చిన మాజీ సర్పంచ్ గోపీనాథ్ - సదరం ధ్రువపత్రాలను సక్రమంగా పరిశీలించాలని కోరిన వికలాంగులు - సీపీఐ నేతల నిరసన

ఒంటరి ఏనుగు దాడిలో పంటల ధ్వంసం




పులిచెర్ల మండలం దేవళంపేటలో, సోమల మండలం కొత్తూరులో ధ్వంసమైన వరి పంట

కల్లూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడం లేదు. మండలంలోని దేవళంపేట పంచాయతీలో ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేసింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతం చింతలవంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు గెండేవారిపల్లి వద్దకు చేరుకుంది. గ్రామంలోని అమర్‌నాథరెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, రవికుమార్‌లకు చెందిన అరటి, వరిపంటలను ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. అక్కడి నుంచి ఒంటరి ఏనుగు వచ్చిన మార్గంలోనే అడవిలోకి చేరుకుంది. సోమవారం పగలంతా అడవిలోని చింతలవంక ఒంటరి ఏనుగు వద్ద తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

● సోమల: సోమల మండలం కొత్తూరులో ఆదివారం రాత్రి సిద్దయ్యకు చెందిన ఎకరా వరి పంటలో ఐదు ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో రైతుకు నష్టం వాటిల్లింది. డ్రిప్ పైపులను తొక్కి ధ్వంసం చేశాయి. పగలు ఇర్లపల్లె ప్రాజెక్టు, పెద్దపొద సమీపంలోని అడవిలో ఉండి రాత్రి సమీప పొలాల్లో సంచరిస్తూ ఏనుగులు నష్టపరుస్తున్నాయని రైతులు వాపోయారు.

తిరుమలలో నెయ్యి నిల్వల సామర్థ్యం పెంపు

● దాదాపు 2.24 లక్షల కిలోలు నిల్వ చేసేలా ఏర్పాట్లు

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదంతో పాటు ఇతర నైవేద్య అన్నప్రసాదాల్లో వినియోగించే నెయ్యిని అధిక మొత్తంలో నిల్వ చేసేలా టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. దాదాపు 2.24 లక్షల కిలోల నెయ్యిని ఒకేసారి నిల్వ చేసుకునేలా ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం టీటీడీ రోజుకు 4 లక్షల నుంచి 4.50 లక్షల వరకు లడ్డూలు, నైవేద్య ప్రసాదాలు వంటి వాటికి 15 వేల నుంచి 17 వేల కేజీల నెయ్యిని వినియోగిస్తోంది. ప్రస్తుతం ఆలయం పక్కనే పుష్కరిణికి అనుకున్న ఉన్న ఘీ స్టోరేజ్ కేంద్రంలో కేవలం నాలుగు ట్యాంకులే ఉన్నాయి. వీటి ద్వారా 80 వేల కేజీలను మాత్రమే నిల్వ చేయగలరు. అంటే నాలుగైదు రోజులకు సరిపడా నెయ్యిని మాత్రమే నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. ఈక్రమంలో నెయ్యి నిల్వలు తగ్గుతున్న సందర్భాల్లో తిరిగి లారీల ద్వారా స్టోర్ చేసుకోవడానికి అధికారులు, సిబ్బంది కంగారుపడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి చెక్ పెట్టేదిశగా టీటీడీ నెయ్యి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే నూతనంగా నాలుగు నూతన ట్యాంకర్లను సిద్ధం చేస్తున్నారు. ఒక్కో ట్యాంకర్ నిల్వ సామర్థ్యం 36 వేల కేజీలు. అంటే 1.44 లక్షల కేజీల అదనపు నెయ్యి నిల్వ సామర్థ్యం టీటీడీకి అందుబాటులోకి రానుంది. ప్రస్తుతమున్న ట్యాంకర్ల నిల్వను కూడా జత చేస్తే దాదాపు 2.24 లక్షల కేజీల నెయ్యిని నిల్వ చేయవచ్చు. వీటి ద్వారా దాదాపు 13 నుంచి 14 రోజులకు సరిపడా నెయ్యిని నిల్వ చేసుకునే వెసులుబాటు టీటీడీకి రానుంది. చెన్నై సూపర్ కింగ్(సీఎస్‌కే) ఈ ట్యాంకర్ల ఏర్పాటుకు విరాళం ఇవ్వడం గమనార్హం.



నిర్మాణంలో ఉన్న నెయ్యి ట్యాంకర్లు

చినుకు పడితే అంతిమ యాత్రకు చింతే



మృతదేహాన్ని గట్టుపై మోసుకెళ్తున్న గ్రామస్తులు

గుడిపాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే మండికృష్ణాపురం పంచాయతీ పెరుమాళ్లకుప్పంలో అంతిమయాత్ర నిర్వహంచడం కష్టతరమే. సోమవారం ఇలాంటి కష్టమే ఎదురైంది. గ్రామానికి చెందిన గిరిజ అనారోగ్యంతో మృతి చెందింది. శ్మశానం సుమారు కిలోమీటర్ దూరంలో ఉంది. రైల్వే అండర్ బ్రిడ్జి కింద కింద నుంచి తీసుకెళితే అర కిలోమీటర్ దూరం తగ్గుతుంది. తాజా వర్షానికి రైల్వే బ్రిడ్జి కింద సుమారు భారీగా నీరు నిలిచి పోయింది. దీంతో గిరిజ మృతదేహాన్ని మోసుకుంటూ శ్మశానం చేరడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సన్నని పొలం గట్టు బాటలో అవస్థలు పడ్డారు. రైల్వే అధికారులు స్పందించి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తెగిన కల్వర్టు.. రాకపోకల బంద్



కొట్రకోన-గారంపల్లె మధ్య తెగిపోయిన తాత్కాలిక కల్వర్టు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల ఉధృతికి గారంపల్లె వద్ద తాత్కాలిక కల్వర్ట్ సోమవారం తెగిపోయింది. ఆదివారం రాత్రి వర్షపు నీరు యాదమరి మండలం, చిత్తూరు నగరం, దొడ్డిపల్లె మీదుగా కొట్రకోన పంచాయతీలోని వంకద్వారా నీవానదిలో కలిసిపోతుంది. ఏడేళ్ల క్రితం కొట్రకోన - గారంపల్లె గ్రామాలకు మధ్య వంకపై కల్వర్ట్ నిర్మించారు. నాలుగేళ్ల క్రితం ఈ కల్వర్టు కొట్టుకుని పోయింది. అప్పటి స్థానిక నేతలు స్పందించి కల్వర్టు స్థానంలో గ్రావెల్ మట్టితో తాత్కాలిక రోడ్డు నిర్మించారు. తాజా వాననీటి వేగానికి ఈ తాత్కాలిక కల్వర్టు కూడా తెగిపోయింది. దీంతో గారంపల్లె, కొల్లావూరు కొట్రకోన, గంగాధరనెల్లూరుల మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. పెనుమూరు మండలం, చిత్తూరు నగరం మీదుగా గంగాధరనెల్లూరు మండలానికి చేరుకోవాలంటే 25 కిలోమీటర్లు ప్రయాణించాల్సి పరిస్థితి ఏర్పడింది.

ట్రంప్ పిచ్చివాగుడుకు ఎవరూ భయపడరు: బీజేపీ

తిరుచానూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ట్రంప్ ఊకదంపుడు ప్రసంగాలు, పిచ్చివాగుడుకు ఎవరూ భయపడరని, ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో భారతదేశం ఆర్థికంగా, శక్తివంతంగా ఎదుగుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు అన్నారు. తిరుచానూరులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా ఏర్పాటు చేసిన ఖాదీ సంత ఖాదీ సంత కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సీఎం చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్ హాజరై ప్రజలందరూ స్వదేశీ వస్తువుల వినియోగానికి మద్దతు ఇవ్వాలని కోరారన్నారు. జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌ను ఊహించని విధంగా దెబ్బతీసినట్లు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌రాజు మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత అభియాన్‌లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. బీజేపీ రాష్ట్రఅధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, నాయకులు గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేపల కోసం వెళ్లి మృత్యువాత

గుడిపాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బండపల్లె చెరువులో ఓవ్యక్తి చేపల కోసం వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. గ్రామానికి చెందిన గోవిందన్(35) శుక్రవారం నుంచి కనపడక పోవడంతో బంధువులు గాలించారు ఆదివారం చెరువులో శవమై తేలినట్టు గుర్తించారు. చేపల కోసం వెళ్లి చెరువులో మునిగి మృతి చెందాడని భావిస్తున్నారు. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

రాయుడి అంశంపై రగడ

● మళ్లీ తెరపైకి వచ్చిన జనసేన మాజీ ఇన్‌ఛార్జి వినుత డ్రైవర్ హత్యోదంతం

● సామాజిక మాధ్యమాల్లో వైరల్ మారిన వీడియో

శ్రీకాళహస్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సరిగ్గా మూడు నెలల కిందట జూలై 12వ తేదీ.. తమిళనాడు సెవెన్‌వెల్స్ ప్రాంతంలో రాయుడు మృతదేహం వెలుగు చూసింది. కూవం నది నుంచి మృతదేహాన్ని వెలికి తీసిన చెన్నై పోలీసులు శ్రీనివాస్ అలియాస్ రాయుడిగా గుర్తించి అప్పటి శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి వినుతతో పాటు ఆమె భర్త చంద్రబాబు సహా ముగ్గురు అనుచరులను అరెస్టు చేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఆ తర్వాత అనూహ్యంగా ఆదివారం రాయుడి సెల్ఫీ వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అందులో అతడి వ్యాఖ్యలు మళ్లీ సర్వత్రా దుమారం రేపాయి. ఈ వీడియో నేపథ్యంలో వినుతతో పాటు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సోమవారం స్పందించారు.

ఏ విచారణకైనా సిద్ధం



'చనిపోయిన రాయుడు నాపై ఆరోపణలు చేస్తూ వైరల్ అవుతున్న వీడియోపై అధికారులు లోతుగా విచారణ జరపాలి. అది ఏఐ టెక్నాలజీ, మార్ఫింగ్ తరహాలోఉంది. ఎక్కడి నుంచి ఈ వీడియో విడుదలైంది అనే దానిపై అధికారులు త్వరలోనే నిగ్గు తేలుస్తారు. మార్ఫింగ్ వీడియో అయినా ఉండాలి.. లేకపోతే శ్రీకాళహస్తిలో అభివృద్ధి పనులతో ప్రజల్లో నాకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక బురదజల్లేందుకు కుట్ర అయినా చేసుండాలి. ఉద్దేశపూర్వకంగా నాకు సంబంధంలేని విషయంలో దుష్ప్రచారం చేస్తున్నారు. చంపే ముందు రాయుడిని బలవంతంగా రాజకీయ లబ్ధి కోసం అసత్య ఆరోపణలు చేయించి ఉండాలి. 2019 ఎన్నికల్లో 5వేల ఓట్లు కూడా పొందలేక వినుత డిపాజిట్ కోల్పోయింది. అలాంటి వారితో రాజకీయంగా నాకు పోటీ ఏముంటుంది? హత్య జరిగిన మూడు నెలల తర్వాత ఇపుడు ఎందుకు వీడియోను బయటపెట్టాల్సి వచ్చింది. కావాలనే నాపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు' అంటూ ఢిల్లీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు.

అతడి చావులో మా ప్రమేయం లేదు



'రాయుడి చావులో మా ప్రమేయం లేదు. మేమే హత్య చేశామంటూ ప్రచారం చేయడం.. జైలుకు వెళ్లడం కన్నా బాధ కలిగించింది. మాపై రాజకీయ కుట్ర జరిగింది. అన్ని ఆధారాలతో బాధ్యులైన వారి పాత్రలను బహిర్గతం చేస్తాం. విదేశాల్లో రూ.లక్షల జీతాలు వచ్చే ఉద్యోగాలను వదులుకుని ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చాం. అంతే కానీ హత్యలు చేయడానికి కాదు. చావులో మా ప్రమేయం లేదు కాబట్టే నాకు 19 రోజులకు, మిగిలిన నలుగురికి నెల రోజుల వ్యవధిలోనే బెయిల్ మంజూరైంది. కేసు విచారణలో ఉండటంతో న్యాయనిపుణుల సలహామేరకు మేము అంతకుమించి వివరాలను వెల్లడించ లేం. న్యాయస్థానం ద్వారా నిర్దోషిగా బయటపడతాం' అంటూ కోట వినుత సెల్ఫీ వీడియో విడుదల చేశారు.

వినుత దంపతులను హతం చేసేందుకు పన్నాగం



'నాపేరు శ్రీనివాసులు అలియాస్ రాయుడు. నేను వినుత దగ్గర డ్రైవర్‌గా పనిచేశా. గతేడాది సార్వత్రిక ఎన్నికలకు ముందు జనసేన నేత పేట చంద్రశేఖర్ ద్వారా టీడీపీ కార్యకర్త సుజిత్‌తో పరిచయం ఏర్పడింది. వినుత దంపతుల కదలికలు, వారి విషయాలను ఎప్పటికప్పుడు చేరవేస్తే రూ.30లక్షలు ఇస్తామని నన్ను ప్రలోభపెట్టారు. ఆ మేరకు రూ.2లక్షలు కూడా వారి నుంచి అందుకున్నా. ఎన్నికల తర్వాత నాకు రూ.20లక్షలు మాత్రమే ఇచ్చారు. మళ్లీ పలుమార్లు పేట చంద్రశేఖర్, సుజిత్ నాతో సంప్రదించి వినుత దంపతులను చంపాలని, మరో రూ.30లక్షలు స్థానిక కూటమిలోని బొజ్జల సుధీర్‌రెడ్డి ద్వారా ఇస్తామని చెప్పారు. నేను కారు నడిపే సమయంలో అతివేగంగా వెళుతూ రోడ్డు ప్రమాదం జరిగేలా రెండుసార్లు ప్రయత్నించే సమయంలో వినుత దంపతులు అప్రమత్తమయ్యారు. అప్పట్నుంచి నన్ను డ్రైవింగ్‌కు దూరంగా పెట్టారు. ఎలాగైనా చంపాలని జనసేన నేత కొట్టే సాయి ద్వారా మళ్లీ నన్ను సంప్రదించారు. తిరుపతిలోని హోటల్‌లో కూటమి ముఖ్యనేత వద్దకు తీసుకెళ్లి మాట్లాడించారు. ఆ తర్వాత వ్యక్తిగత వీడియోలు సేకరించి పంపాలని ఒత్తిడి చేశారు. ఒకరోజు నేను వీడియో చిత్రీకరించే సమయంలో నా ఫోన్‌కు మెసేజ్ రావడంతో పట్టుబడ్డా. ఈ విషయాన్ని ఆ ముఖ్యనేత, కొట్టేసాయి, చంద్రశేఖర్, సుజిత్‌కు ఫోను ద్వారా సందేశం పంపా. వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. మళ్లీ నన్ను నేరుగా కలిసిన చంద్రశేఖర్, సుజిత్ ఎవరి పేర్లు బయట రాకూడదని, అలా వస్తే ఇబ్బందులో పడుతావని హెచ్చరించారు' అంటూ ఆ వీడియోలో రాయుడి మాటలు సాగాయి.

వైద్య విద్యార్థికి నిబద్ధత అవసరం



ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించిన డాక్టర్ సురేశ్ కృష్ణమూర్తి తదితర వైద్య ప్రముఖులు

కుప్పం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థికి చేసే పనిలో నిబద్ధత, కరుణ అవసరమని పీఈఎస్ వైద్య కళాశాల మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ కృష్ణమూర్తి అన్నారు. కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో సోమవారం ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం 24వ బ్యాచ్ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య విద్యార్థులు సహనం, ఓర్పు, రోగులపై ప్రేమతో మెలగాలని, ఇప్పటినుంచే ఈ లక్షణాలు అలవరచుకుంటే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరడానికి అవకాశం ఉంటుందన్నారు. కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ వైద్య విద్యలో పాటించాల్సిన ఉన్నత ప్రమాణాలు, నిబద్ధతల గురించి వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఈఎస్ వైద్య కళాశాల పూర్వ విద్యార్థి అయిన ఎస్ఆర్ఎంసీ మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ప్రొఫెసర్ అండ్ కన్సల్టెంట్ డాక్టర్ కౌశిక్ మాటాడుతూ పీఈఎస్‌లో గడిపిన విద్యార్థి దశ అనుభవాలను వివరించారు. చివరగా పీఈఎస్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే.సుబ్రహ్మణ్య ధన్యవాద ప్రసంగం చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఆరోగ్యవిద్యాధికారి కాంతమ్మ

బైరెడ్డిపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల సంరక్షణ అందరి బాధ్యతగా గుర్తించాలని బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీల ఆరోగ్యవిద్యాధికారులు సావిత్రి, కాంతమ్మ తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే వ్యక్తిగత శుభ్రత, పోషకాహార ప్రాముఖ్యత, బాల్యవివాహాలతో కలిగే సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమిత్ర, సీహెచ్‌వో సాయిదివ్య, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి



ప్రజా సమస్యలపై అధికారులకు సూచనలిస్తున్న కడా పీడీ

కుప్పం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వివిధ సమస్యలపై వస్తున్న అర్జీలపై దృష్టి పెట్టి పరిష్కారానికి చొరవ చూపాలని కడా పీడీ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. కుప్పం మండల సచివాలయం సమావేశపు హాలులో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి ఆయా ఫిర్యాదులను సంబంధిత శాఖలకు బదిలీ చేశారు. వెంటనే క్షేత్ర స్థాయి పరిశీలన చేసి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడంతో పైనుంచి నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, అధికారుల పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. లేదంటే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్‌కుమార్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

పలమనేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పలమనేరు డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 14న 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ అల్తాఫ్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు తమ ఇబ్బందులను ఫోన్ నంబరు 9959225678 ను సంప్రదించవచ్చని.. మరింత మెరుగైన సేవలు అందించేందుకు సహకరించాలని డిపో మేనేజర్ కోరారు.

నేడు పుంగనూరులో జాబ్‌మేళా

చౌడేపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న మంగళవారం పుంగనూరులో జరుగనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సుబ్రహ్మణ్యం అన్నారు. పుంగనూరులో 10 పరిశ్రమల ప్రతినిధులతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్‌పై మళ్లీ నిషేధ ప్రయత్నం!

కుప్పం మున్సిపాలిటీలో అధికారుల విస్తృత ప్రచారం



కుప్పం పట్టణంలోని ఓ దుకాణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై ప్రచారం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కుప్పం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో వన్ టైమ్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలన్న ప్రయత్నాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. మున్సిపల్ అధికారులు ఈ దిశగా విస్తృత ప్రచారం ప్రారంభించారు. అయితే అమలుతీరు ఎలా ఉంటున్నది ఇప్పుడే చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.

కుప్పంలో ప్లాస్టిక్ విచ్చలవిడి వాడకం అధికమైంది. ఎక్కడ చూసినా చిల్లర దుకాణాల నుంచి సూపర్ బజార్ల వరకు పాలిథీన్ కవర్లు, ఇతర వన్‌టైమ్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం జరుగుతోంది. కవర్ల రూపంలో ఉండే ప్లాస్టిక్ సంచుల్లోనే కొనుగోలు చేసిన వస్తువులను వినియోగదారులకు ఇస్తున్నారు. ఇలా ఇళ్లకు తీసుకొచ్చిన ప్లాస్టిక్ కవర్లను వాడిన తర్వాత ఎక్కడపడితే అక్కడ ప్రజలు పడేస్తున్నారు. మురుగు కాలువలు, చెత్తకుప్పల నిండుగా ఈ ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. అధికారుల అంచనాల ప్రకారం కుప్పం మున్సిపాలిటీ పరిధిలో 15 వేల కుటుంబాలున్నాయి. లెక్కల్లో చేరని కుటుంబాలు మరో వెయ్యివరకు ఉండొచ్చు. వీరుకాక కుప్పానికి రాకపోకలు సాగించే జనం ఎటూ ఉండనే ఉన్నారు. వీరంతా ప్లాస్టిక్ పదార్థాలను, పాలిథీన్ కవర్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. అధిక శాతం దుకాణదారుల నుంచి కొనుగోలు చేసిన వస్తువుల కోసం ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఎక్కువగా జరుగుతోంది. వ్యాపారులు కూడా ప్లాస్టిక్ కవర్లు తక్కువ ధరకు అధిక పరిమాణం వస్తుండటంతో వాటినే అలవాటు చేశారు. ఫలితంగా మున్సిపాలిటీ పరిధిలో రోజుకు 20 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా ఇందులో ముప్పావు వంతు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. వీటిని వాడేసిన తర్వాత బాధ్యతారహితంగా పడేస్తుండటంతో పారిశుధ్య నిర్వహణకు తీవ్ర ఆటంకం కలుగుతుండటమే కాక, పర్యావరణానికి విపరీతమైన హాని ఏర్పడుతోంది. ఫలితంగా మానవులు, జంతువుల ఆరోగ్యానికి హాని కలుగుతోంది.

● నిషేధంపై విస్తృత ప్రచారం

ప్లాస్టిక్ వాడకంతో ఎదురయ్యే కష్టనష్టాలను గుర్తించిన మున్సిపల్ అధికార యంత్రాంగం ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతం ప్రచారం చేస్తోంది. సుమారుగా పదిరోజుల నుంచి ఈ ప్రచారం ఊపందుకుంది. ముందుగా వ్యాపార సంస్థలు, చిన్నచిన్న దుకాణాల దగ్గరకు వెళ్లి, ప్లాస్టిక్ వాడరాదంటూ మున్సిపల్ సిబ్బంది చెబుతున్నారు. వినియోగదారులకు ప్లాస్టిక్ కవర్లలో వస్తువులు ఇవ్వరాదని ప్రచారం చేస్తున్నారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ సంచులకు బదులుగా గుడ్డ సంచులు, కాగితపు సంచులు వాడాలని, వాటినే వినియోగదారులకు అలవాటు చేయాలని సూచిస్తున్నారు. నిషేధపు ఆజ్ఞలు ఉల్లంఘించి ప్లాస్టిక్ సంచులు వినియోగిస్తే జరిమానా విధిస్తామని, మళ్లీమళ్లీ వినియోగిస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు అధికారులు. వారి నిషేధాజ్ఞలు సరిగా అమలయితే అందరికీ సంతోషమే. కానీ గతానుభవాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. కుప్పం మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలో డాక్టర్ వెంకటేశ్ సర్పంచిగా ఉన్నప్పుడు ఇలాగే పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్‌ను నిషేధించారు. ఒకసారి వాడుతూ కనబడితే కాస్త తక్కువగా, రెండోసారి వాడితే ఎక్కువగా దుకాణదారులకు జరిమానాలు విధించారు. కాదని మూడోసారి, నాలుగోసారి ప్లాస్టిక్‌ను వినియోగిస్తూ పట్టుబడితే దుకాణాల లైసెన్సులు రద్దు చేసేవరకు కఠిన చర్యలు తీసుకున్నారు. అయితే దీంతో దుకాణదారులకు, పాలకులకు, అధికారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగాయి. చివరకు కొన్నిరోజులపాటు కఠినంగా అమలు చేసిన ప్లాస్టిక్ నిషేధం తుస్సుమని గాలికి కొట్టుకుపోయింది.

● ఆచరణాత్మకంగా ఉంటేనే ఫలితం

ప్లాస్టిక్ కవర్లను పూర్తిస్థాయిలో నిషేధం విధించే ముందు, వాటి స్థానంలో తక్కువ ధరకు వచ్చే గుడ్డ సంచులో.. పర్యావరణ హితమైన మరెటువంటి సంచిలో మున్సిపాలిటీ , ప్రభుత్వం అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. ఇది జరగకుండా ప్లాస్టిక్ నిషేధం అంత సులువుగా అమలయ్యే అవకాశం లేదని గతానుభవాలు నిరూపిస్తున్నాయి. అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూపుతూ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ

పలమనేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ సోమవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి శాలువతో సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా మురళీకృష్ణ, సభ్యులుగా మంజు, పెద్దరెడ్డెప్ప, మోహన మురళీ, వీరప్ప, మోహన ప్రియ, సుజాత, భువనేశ్వరి, సరిత, ప్రసాద్, కుమారస్వామి, సత్యవతిబాబు నియమితులయ్యారు. ఆలయ కమిటీలో తమకు చోటు కల్పించినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్ తదితరులు


రామకుప్పం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంద్యాల మడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మునివెంకటమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్‌లు స్థానిక నేతలతో కలిసి మునివెంకటమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరఫున రూ.12 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, పరశురాం, గజేంద్ర, మునిరాజ్, మురుగేష్, రమణ, వినోద్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు. 13పిజిఆర్ఎస్‌డిఎం01: తగ్గిన జీఎస్టీ సంస్కరణలపై బ్యానర్లు ప్రదర్శిస్తున్న ప్రభుత్వ సిబ్బంది

తగ్గిన జీఎస్టీతో మహిళా సాధికారత సరళతరం



సదుంలో దుకాణాల వద్ద జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అమలుతో తగ్గిన జీఎస్టీ ధరలతో మహిళా సాధికారతకు బాటలు పడ్డాయని ఎంపీడీవో రాధారాణి పేర్కొన్నారు. సదుం బస్టాండు కూడలిలో సోమవారం సూపర్ మార్కెట్లు, ఫ్యాన్సీ స్టోర్లు తదితర దుకాణాల వద్ద సవరించిన జీఎస్టీతో తగ్గిన నిత్యావసర వస్తువుల ధరలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు నటరాజన్, దామోదర్, ఏపీఎం హరిప్రసాద్, సంఘమిత్రలు, వీవో లీడర్లు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

● **పలమనేరు:** జీఎస్టీ-2.0 సంస్కరణలలో 99 శాతం వస్తువులకు పన్నులు లేవని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. సోమవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఎస్టీ -2.0 సంస్కరణలతో 99 శాతం వస్తువులు, సేవలు పన్ను రహితంగా ఉన్నాయన్నారు. అనంతరం మోటర్‌సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మోహిద్దీన్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ జి.హరిప్రసాద్, ఆర్వో అనిల్‌కుమార్, ఏఈ స్నేహప్రియ, టీపీవో ఇందిర, పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షులు బాలాజీ, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దారి సమస్యకు పరిష్కారం



స్థానికులతో చర్చిస్తున్న వెంకటరమణ

రామకుప్పం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో ఏళ్లగా నలుగుతున్న దారి సమస్య టీడీపీ మండలాధ్యక్షుడు వెంకటరమణ చొరవతో ఎట్టకేలకు పరిష్కారమైంది. స్థానికులు దారి సమస్యపై ఇటీవల కుప్పం టీడీపీ కార్యాలయంలో జననాయకుడులో వినతిపత్రం ఇచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు వెంకటరమణ, మాజీ సర్పంచి రామకృష్ణప్ప కాలనీని సందర్శించి దారి సమస్యపై ఇరువర్గాలతో చర్చించారు. వారు ఇరువర్గాల అభిప్రాయాలను తెలుసుకుని సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఇన్‌చార్జి నవీన్, నేతలు శ్రీరాములు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట



జీఎస్టీపై రామకుప్పంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రామకుప్పం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పలు రకాల వస్తువులపై జీఎస్టీ రద్దు చేసిందని జీఎస్టీ జిల్లా డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన నేతృత్వంలో స్థానిక అధికారులు, స్థానికులతో జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు కైలేష్, డీటీ బాలాజీ, ఇన్‌చార్జి ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి



రక్తపరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న మునస్వామి

రామకుప్పం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, తెలుగురైతు కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం తెలిపారు. సోమవారం మండల పరిధి పాలరేవుగడ్డ, పెద్దగానూరుల్లో విజలాపురం ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి పూజిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత రక్తపరీక్ష శిబిరాలను ప్రారంభించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, నేతలు సత్తి, మహేంద్రనాయుడు, కృష్ణారెడ్డి, శ్రీనివాలసులు, హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎంఎల్‌హెచ్‌సీలు పుష్ప, శ్రావణి, ఏఎన్ఎంలు రాధా, సుకన్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌస్‌పీర్‌ఖాన్‌ను పరామర్శించిన చల్లా



టీడీపీ నాయకుడిని పరామర్శించిన చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు, మదరసా కమిటీ చైర్మన్ సి.గౌస్‌పీర్‌ఖాన్ ద్విచక్రవాహనంలో వెళ్తూ ప్రమాదానికి గురై తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సోమవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వైద్యులతో సంప్రదించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయనతో మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు పరామర్శించాడు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పుంగనూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు సమీపంలోని ప్రభుత్వ మైనారిటీ ఐటీఐలో ప్రవేశానికి అర్హత కలిగిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి కోరారు. పదో తరగతి, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన యువతీ యువకులు ఆన్‌లైన్‌లో ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాలికలకు ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ కోర్సులు ఉన్నట్లు తెలిపారు.

23 లోపు అక్రమ లేఅవుట్లు క్రమబద్ధీకరణ చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీడీ సంజీవ్‌కుమార్

పలమనేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23వ తేదీలోపు అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరణ అయ్యేట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ సంజీవ్‌కుమార్ సూచించారు. సోమవారం పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌టీపీలు, లేఅవుట్ యజమానులు, టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్షించారు. క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పలు రాయితీలను ఇచ్చిందని వివరించారు. కార్యక్రమంలో పలమనేరు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, టీపీవో ఇందిర పాల్గొన్నారు.

నాటు తుపాకీ స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న అటవీశాఖ అధికారి శ్రీరాములు

సోమల, పుంగనూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నాటు తుపాకీ స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసినట్లు పుంగనూరు అటవీ అధికారి శ్రీరాములు తెలిపారు. ఆయన కథనం మేరకు... ఆదివారం సోమల మండలం అన్నెమ్మగారిపల్లె పంచాయతీ వడ్డిరామాపురానికి చెందిన బోయకొండయ్య (40) రాయలపేట- ఆవులపల్లె అటవీ ప్రాంతంలో ద్విచక్రవాహనంలో నాటు తుపాకితో తిరుగుతుండగా ఫారెస్ట్ బీట్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. తుపాకితో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

స్వదేశీ వస్తువులనే వాడుకోవాలి



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

బైరెడ్డిపల్లె అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శరవణకుమార్, నాయకులు నాగరాజుశెట్టి, నటరాజ, సోమశేఖర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** ప్రజలు స్వదేశీ వస్తువుల వాడకాలకు మొగ్గుచూపాలని బీజేపీ చిత్తూరు జిల్లా కార్యదర్శి లబ్బారెడ్డి వెంకట్రమణ, మండలపార్టీ అధ్యక్షుడు గరిగి నాగరాజ పిలుపునిచ్చారు. సోమవారం రొంపిచెర్లలో ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంపై సమావేశమయ్యారు. ఏఎంసీ డైరెక్టర్ వెంకట్రమణ నాయుడు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వి.వి సుధాకర రెడ్డి, నాయకులు చంద్రయ్య, మునిరత్నం పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పుంగనూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యం కేసు నమోదు చేసినట్లు సోమవారం పుంగనూరు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మసూద్ కుమార్తె హీనా కౌసర్(20) మూడు రోజుల నుంచి కనిపించలేదని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పుంగనూరు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం అడవినాథునికుంటలో మద్యం బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. రాగానిపల్లె పంచాయతీ అడవినాథునికుంట గ్రామానికి చెందిన చెంగారెడ్డి(70) మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేయగా అతని వద్ద 70 మద్యం బాటిళ్లు పట్టుబడినట్లు చెప్పారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణ వాదన సరికాదు: గౌనివారి

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిపాలనా అంశాలపై అవగాహనలేమితో రాష్ట్రంలో ప్రతిపక్షం ప్రభుత్వంపై బురదజల్లాలని చూస్తోందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. పీపీపీ విధానంలో వైద్యకళాశాల ఏర్పాటు అంటే ప్రైవేటీకరణ కాదని ఆయన స్పష్టం చేశారు. వైద్య కళాశాలలు, ఆస్పత్రులు ప్రభుత్వ యాజమాన్యంలోనే కొనసాగుతాయన్నారు. ప్రైవేటు సంస్థలు కేవలం నిర్మాణం, పెట్టుబడి, నిర్వహణ బాధ్యతలు మాత్రమే తీసుకుంటాయని తెలిపారు. పీపీపీ విధానం ద్వారా వైద్యసేవలను మెరుగుపర్చడం, ప్రభుత్వ నిర్వహణ ఖర్చులు తగ్గించడమే లక్ష్యమన్నారు. అలాగే పీపీపీ విధానంలో వైద్యవిద్య ప్రైవేటీకరణ కాదని, 50 శాతం సీట్లు ప్రభుత్వ కోటాలోనే ఉంటాయని తెలిపారు. రిజర్వేషన్లపై ఈ విధానం ఎటువంటి ప్రభావం చూపదని, రిజర్వేషన్లు యథావిధిగా కొనసాగుతాయన్నారు. పీపీపీ విధానంతో వైద్యకళాశాలు, అస్పత్రులు ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రైవేటు సంస్థల పరం కాదని ప్రభుత్వ యాజమాన్యం, నియంత్రణలోనే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

టపాసుల దుకాణాలకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్వతి

చౌడేపల్లె, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): టపాకాయల దుకాణాల నిర్వహణ కోసం తహసీల్దార్ పార్వతి సోమవారం స్థల పరిశీలన చేశారు. చౌడేపల్లెలో దీపావళి సందర్భంగా టపాకాయల దుకాణాల కోసం స్థలాన్ని తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు అనుగుణంగా, ప్రమాద రహితంగా ఉండే స్థలంలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, అగ్ని ప్రమాద నివారణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాపారులు కృష్ణయ్య, శివశంకరరావు, శబరి, వీఆర్వో విజయ్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఓబిరెడ్డిపల్లెలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రాము

పుంగనూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం వనమలదిన్నె పంచాయతీ ఓబిరెడ్డిపల్లెలో గ్రామ కంఠం స్థలంలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందించారు. ప్రజా ఫిర్యాదుల దినం సందర్భంగా ప్రజల నుంచి తహసీల్దార్ వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫణికుమార్, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాలీబాల్ సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి మృతి



కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాలీబాల్ సంఘ అధ్యక్షుడు, వైసీపీ నాయకుడు మేలుపట్ల కృష్ణారెడ్డి సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,పట్టణ ప్రముఖులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైసీపీ శ్రేణుల నిరసన



ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

పుంగనూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం విక్రయిస్తున్నారని చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ఆధ్వర్యంలో సోమవారం పుంగనూరులో వైసీపీ నాయకులు నిరసన తెలిపారు. ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ సీఐ సురేశ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, వైసీపీ నాయకులు నాగభూషణం, షరీఫ్, రాగానిపల్లె బాబురెడ్డి, రాజేశ్, ఆవుల అమరనాథ్, రాజశేఖర్ రెడ్డి, అమ్ము, నటరాజ, జయకృష్ణ పాల్గొన్నారు.



పలమనేరులో వైసీపీ నిరసన ర్యాలీ

● **పలమనేరు:** పలమనేరులో సోమవారం మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ కమిటీ వద్ద కల్తీ మద్యం అమ్ముతున్నారంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలమనేరు ఎక్సైజ్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి సీఐకి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో అంగన్‌వాడీ కేంద్రం



శ్రీరంగరాజపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి ఎగువ మెదవాడలోని అంగన్‌వాడీ ప్రీప్రైమరీ స్కూల్‌లో నీరు చేరిపోయింది. దీంతో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరవలేకపోయారు. అంగన్‌వాడీ స్కూల్‌లో వర్షపు నీరు నిల్వ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మురుగు కాలువల ఏర్పాటుకు పరిశీలన



రోడ్డు మీదకు చేరిన నీటిని పరిశీలిస్తున్న పంచాయతీ అధికారి మాధవి

ఐరాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక న్యూ కాలనీలో మురుగు కాలువల ఏర్పాటుకు అధికారులు పరిశీలించారు. కాలనీ ఏర్పడి ఏడేళ్లవుతున్నా కాలనీలో మురుగునీటి కాలువలు లేవు. వర్షం కురిస్తే మురుగునీరు రోడ్డుపైకి చేరుతుండటం సమస్యగా మారింది. ప్రధాన రహదారిలో నిత్యం మురుగు నీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువల సమస్యను తీర్చాలని కాలనీ వాసులు కోరుకుంటున్నారు. దీనిపై పంచాయతీ అధికారి మాధవి సోమవారం ఇక్కడి పరిస్థితులను పరిశీలించారు.

వర్షాలకు దెబ్బతింటున్న రహదారులు



చిత్తూరు రోడ్డులో నిలిచిన నీరు

పెనుమూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు రహదారులను దెబ్బతీశాయి. పలు రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. ప్రత్యేకించి గ్రానైట్, సిమెంటు, టిప్పర్ వాహనాలు తరచూ సంచరించే రోడ్లు మట్టిపొరతో మెత్తబడిపోవడంతో వర్షాల నీరు చొరబడి పగుళ్లు వస్తున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే రోడ్లు పూర్తిగా పాడై, వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. సంబంధిత పంచాయతీ, రోడ్లు, భవనాలశాఖ అధికారులు స్పందించి వర్షపు నీరు రోడ్లపై కాకుండా పక్క కాలువల్లోకి దారి మళ్లించేలా చర్యలు తీసుకోవాలి.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా సెల్వం



గణేష్‌యాదవ్‌కు శాలువ కప్పుతున్న సెల్వం

గుడిపాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తుమ్మవారిపల్లె దళితవాడకు చెందిన సెల్వంను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోటూరుభాస్కర్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ గణేష్‌యాదవ్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఈయనను ఎన్నుకున్నారు. ఆయన్ను సెల్వం శాలువాతో సత్కరించారు.

దేశమ్మ పాలకమండలి ప్రమాణ స్వీకారం





ప్రమాణ స్వీకారం చేస్తున్న దేవాలయ పాలక మండలి చైర్మన్, సభ్యులు -బాధ్యతలు చేపడుతున్న కడంబోరు రత్నవేలు మణి మొదలియార్

నగరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): టీఆర్‌కండ్రిగలోని నేత్ర ప్రదాయని దేశమ్మ దేవాలయ పాలకమండలి చైర్మన్‌గా కడంబోరు రత్నవేలు మని మొదలియార్ సోమవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేశారు. అయనతోపాలు సభ్యులు మదన్‌కుమార్, వి.కృష్ణారెడ్డి, కె.హేమలత, ఉపేంద్రరెడ్డి, ఎస్.సుశీల, జయంతి, కె.లక్ష్మి, పి.కస్తూరి, కె.సోమసుందరం, నీలకంఠం స్వాములు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. కార్య నిర్వాహణాధికారి వెంకటేశ్వరులు వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ మర్యాదలతో వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానికులు పాలకమండలి చైర్మన్‌ను సభ్యులను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర బీజేపీ యువత అధ్యక్షురాలు, జనసేన నాయకుడు మెరుపుల మహేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు శీనురాజు, బాలాజీ, రామచంద్రన్, వడివేలు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు అభినందనలు



ఉపాధ్యాయులతో ఎంఈవో తదితరులు

యాదమరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో రుక్మిణమ్మ మాట్లాడుతూ ఈ డీఎస్సీ ద్వారా మండలానికి ముగ్గురు ఉపాధ్యాయులు వచ్చారన్నారు. గౌతమి (తెల్లరాళ్ళపల్లి), నేతాజీ (ఎస్జీటీ) - ఎంవైవీ కాలనీ, షేక్ అయూబ్ (ఉర్దూ) - (12 కమ్మపల్లి)లను అభినందించారు. ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షులు మదన్‌మోహన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం పిళ్ళై, యూటీఎఫ్ నాయకులు సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై కన్నేయండి

పాలసముద్రం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలకు గురికాకుండా చూడాలని తహసీల్దార్ అరుణకుమారి పేర్కొన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమిళనాడుకు సరిహద్దు ప్రాంతాలైన వనదుర్గాపురం, కోదండరామాపురం, తిరుమలరాజుపురం పంచాయతీలలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడానికి గుడిసెలు వేసుకుంటున్నారన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలు అప్రమత్తంగా ఉండి తమకు వెంటనే తెలియజేయాలన్నారు. అలాంటి పాకలను తొలగించాలని ఆదేశించారు. డీటీ రుషివర్మ, ఆర్ఐ దేవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు



టీకాలను ప్రారంభిస్తున్న టీడీపీ నేత రాజా

వెదురుకుప్పం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పాడి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించుకోవాలని, దీనికి పాడి రైతులు సహకరించాలని టీడీపీ నాయకుడు రాజా సూచించారు. సోమవారం కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లిలో టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు ఉచితంగా ఇంటి వద్దనే చికిత్స అందిస్తున్నారన్నారు. సోమవారం 120 పశువులకు టీకాలు వేశారు.

చేనేతలకు జీఎస్టీ తగ్గింపు

పెనుమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చేనేత భవనంలో సోమవారం జరిగిన చేనేతల సమావేశానికి హ్యాండ్లూమ్ ఏడీ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలకు 18 శాతం నుండి 5 శాతానికి రెడీమేడ్ దుస్తులు తగ్గాయని 2500లోపు కొంటే ఇది వర్తిస్తుందన్నారు.. ప్రధాన కార్యదర్శి షణ్ముగ వర్మ మాట్లాడారు. జీఎస్టీ అధికారులు యోగానంద, వెంకట్‌రెడ్డి, బాలాజి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

నీతిఆయోగ్ డైరెక్టర్‌ను కలిసిన కలెక్టర్



చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నీతిఆయోగ్ డైరక్టర్ ఎండీ జుబైర్ అలీ హష్మీ సోమవారం స్థానిక ఆర్‌అండ్ బీ అతిథిగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏఎంసీ చైర్మన్ రాజమ్మకు సత్కారం



విజయపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మహారాజపురంలో నగరి ఏఎంసీ చైర్మన్ రాజమ్మను సోమవారం టీడీపీ నాయకులు కలిసి సన్మానించారు. రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, తమిళనాడుకు చెందిన పారిశ్రామికవేత్తలు వరదరాజన్, విజయన్, టీడీపీ నాయకులు లోకేష్‌రాజు, కొండూరు దాము తదితరులు అభినందించారు.

ఐటీఐలో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఐదవ విడతలో ఖాళీగా ఉన్న ట్రేడులకు ఈ నెల 16వ తేదీలోపు ఆసక్తికలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఈ నెల 17న కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 7998679351 నెంబరును సంప్రదించాలని కోరారు.

22న షాపింగ్ కాంప్లెక్స్ వేలం

పెనుమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంతగేటు పక్కన పంచాయతీ షాపులకు ఈనెల 22న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కార్యదర్శి ప్రభుకిరణ్ తెలిపారు. వచ్చే నెల 1 నుంచి 2028 సెప్టెంబరు 30 వరకు కాలపరిమితి ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ.30 వేలు పెనుమూరు పంచాయతీ కార్యదర్శి పేరుతో బ్యాంకులో డీడీ, చెక్కు రూపంలో చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



క్రీడాదుస్తులు ధరించిన క్రీడాకారులు

వెదురుకుప్పం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దేవళంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం జిల్లా రచయితల సంఘం సభ్యురాలు, కవయిత్రి వడ్లపట్ల శ్యామలాదేవి క్రీడా దుస్తులను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వితరణతో ఇచ్చిన దుస్తులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్తీ లిక్కర్ స్కాంపై సీబీఐ విచారణ చేపట్టాలి : మంత్రి రోజా



ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రమిస్తున్న రోజా

నగరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కల్తీ లిక్కర్ స్కాంపై సీబీఐ విచారణ చేపట్టాలని మాజీ మంత్రి రోజా డిమాండ్ చేశారు. నగరి సోమవారం వైసీపీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులురెడ్డికి అందించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ సిట్ ద్వారా విచారణ చేస్తే న్యాయం జరగదన్నారు. ప్రభుత్వం వేసిన ఏ సిట్ ఇంతవరకు విచారించి శిక్షలు వేసింది లేదన్నారు. అభివృద్ధిని సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్‌లు నీలమేఘం, హరి, వైస్ చైర్మన్‌లు జయప్రకాష్, శంకర్, నగరి, పుత్తూరు, నిండ్ర, విజయపురం ఎంపీపీలు భార్గవి, మునివేలు, మంజు బాలాజీ, దుర్గాదేవి, రమేష్‌రెడ్డి, ఏకాంబరం, తిరుమలరెడ్డి, శివరాజు తదితరులు పాల్గొన్నారు. **చిత్తూరు అర్బన్:** నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐకి వినతిపత్రాన్ని ఇచ్చారు. వైసీపీ నగర అధ్యక్షులు కేపీ శ్రీధర్,చంద్రశేఖర్, జ్ఞాన జగదీశ్, గాయత్రిదేవి, తదితరులు పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మి సారథ్యంలో వైసీపీ శ్రేణులు ర్యాలీ నిర్వహించాయి. అనంతరం వీరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఎదుట బైఠాయించారు. సీఐ శిరీషాదేవి, ఎస్ఐ శ్రావణ్ కుమార్‌లకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఎన్.రాధిక, ధనంజయవర్మ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. కాగా అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు హాజరు కాకుండా కృపాలక్ష్మికి ఝలక్ ఇచ్చారు. ముఖ్యనాయకులు కూడా హాజరు కాలేదు.

తాగునీటి కొళాయి పనుల ప్రారంభం

వెదురుకుప్పం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీ కాలనీలో ఇంటింటికీ తాగునీటి కొళాయి ద్వారా తాగునీటి వసతి కల్పించడానికి చర్యలు చేపట్టామని ఎంపీటీసీ ఎన్.రాధిక తెలిపారు. ఈక్రమంలో సోమవారం ఆమె తవ్వకపు పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల్లో రూ.3.70 లక్షలు ఇందుకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుత్తూరు పురందర్‌రెడ్డి, బత్తల చిరంజీవిరెడ్డి, పేట రమేష్‌రెడ్డి, వాసు ఉన్నారు.

శ్మశాన స్థలాన్ని కాపాడాలని వినతి

నగరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఓజీ కుప్పంలో ఆక్రమణకు గురవుతున్న శ్మశాన స్థలాన్ని కాపాడాలంటూ వైఎంపీపీ కన్నియప్ప ఆధ్వర్యంలో గ్రామస్తులు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థలంలో కొందరు రాళ్లు పేర్చి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనివల్ల శ్మశానం కుంచించుకుపోయి ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ స్థలాన్ని పరిశీలిస్తానన్నారు. .

నీవానది జోరుతో రాకపోకలకు అవస్థలు



జోడిచింతల వద్ద దెబ్బతిన్న రహదారి



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ పార్థసారథి

యాదమరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీవర్షాల కారణంగా నీవానది ప్రవాహం ప్రమాదకరంగా మారింది. చెరువులకు నీరు చేరి మొరవ పారుతుండడంతో నీవానదిలో నీరు ఉరకలెత్తుతోంది. ఆదివారం రాత్రి వర్షాలకు పత్రపల్లి, పాచిగుంట, రంగనాయక చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. నీవానది ప్రవాహం మరింత ఉధృతమైంది. భూమిరెడ్డిపల్లి పంచాయతీలోని వెంకటాపురం, కీనాటంపల్లి పంచాయతీలోని కోయిమూరు గ్రామాలకు రాకపోకలకు దారులు లేకపోవడంతో విద్యార్థులకు పాఠశాలల సెలవు ప్రకటించారు. యాదమరిలోని వరదరాజు స్వామి ఆలయం ఎదురుగా నీవానది ప్రవాహం కాజ్‌వే పై నుంచి ఉరకలెత్తడంతో రహదారి తెగిపోవడానికి సిద్ధంగా ఉంది. జోడిచింతల వద్ద మాదిరెడ్డిపల్లి రోడ్డులో రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. తహసీల్దార్ పార్థసారథి, ఎస్ఐ ఈశ్వర్ పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు.



జొన్నవాళ్ళమిట్ట వద్ద నిలిచిన రాకపోకలు

ప్రవహిస్తున్న వంకలు,చెరువులు

గుడిపాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు వంకలు, చెరువు కలుజులు జోరుగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది అవుతోంది. గుర్రాలమిట్ట నుంచి చెరుకూరుకండ్రిగ, గుడిపాల అరుందతివాడ, నారగల్లు, కృష్ణజిమ్మాపురం, చీలాపల్లె, మొగరాలపల్లె,గట్రాళ్ల మిట్ట, గురుగునత్తం,197రామాపురం గ్రామాలకు వెళ్లే రహదారులలో నీరు ఎక్కువగా ప్రవహిస్తుండటంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ జయపాల్, మండల మాజీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ కోరారు.



గుడిపాల అరుంధతివాడ వద్ద మొరవ పారుతున్న చెరువు

ఎంపీటీసీలు, సర్పంచ్‌ల నిరసన



కింద కూర్చుని నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు,సర్పంచ్‌లు

నగరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నన్, జడ్పీటీసీ గాంధీల ఆధ్వర్యంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బిల్లుల కోసం నిరసన వ్యక్తం చేశారు. పనులకు బిల్లులు ఇవ్వకుండా అధికారులు సతాయిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఎంపీడీవో వాణిని వారు కోరారు. సోమవారం జరిగిన మండల సమావేశంలో వారు గంటకు పైగా కింద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో వాణి, చిత్తూరు జడ్పీసీఈవోకి సమాచారం అందించారు. సీఈవో వెంటనే ఎంపీపీ భార్గవి, జడ్పీటీసీ గాంధీలతో ఫోన్లో చర్చించారు. సీఈవో లేద కలెక్టర్ కాని వస్తే తప్ప తాము పైకి లేచేది లేదని భీష్మించుకున్నారు. ఎంపీడీవో, సీఈవో ఈ వారంలో వస్తారని, నెలాఖరు లోపు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో మండల సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. నిరసనల మధ్య సమావేశాన్ని నిర్వహించారు.

స్వదేశీ ఉత్పత్తుల వినియోగంతో దేశ ప్రగతి



మీడియాతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పూతలపట్టు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ ఉత్పత్తులను వినియోగిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని బీజేపీ నాయకులు కోరారు. పూతలపట్టులో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు 'ఆత్మనిర్భర్ నిర్వహించామన్నారు. ప్రతి ఇంట స్వదేశీ ఉత్పత్తినే వినియోగించే కార్యక్రమాన్ని గడపగడపకూ తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, మండల అధ్యక్షుడు ప్రసాద్, బీజేవైఎం అధ్యక్షుడు దామోధర్ రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రకాష్, మండల ఉపాధ్యక్షుడు బాలక్రిష్ణ, నాయకులు లక్ష్మీపతి, కమలాకర్ రెడ్డి, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు నిర్మాణాన్ని అడ్డుకుంటాం



అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌తో మాట్లాడుతున్న బద్రినారాయణ తదితరులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో శ్రీనివాస ట్రస్టు ఆధ్వర్యంలో కొంగారెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ వద్ద పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తామని పనులు చేయడం సరైన పద్ధతి కాదని కూటమి పార్టీ నేతల డీకే బద్రినారాయణ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్‌తో చర్చించారు. ఈ సందర్భంగా డీకే బద్రినారాయణ మాట్లాడుతూ 2014లో ఎమ్మెల్యేగా ఉన్న డీకే సత్యప్రభ శ్రీనివాస ట్రస్టు ఆధ్వర్యంలో నగరంలో 19ప్లాంట్లను ఏర్పాటు చేశారన్నారు. కొంగారెడ్డిపల్లెలో ప్లాంట్‌ను చంద్రబాబు ప్రారంభించారన్నారు. ఈ ప్లాంట్ నుంచి నాలుగు డివిజన్ల ప్రజలు నీటిని తీసుకెళుతున్నారు. అలాంటి ప్లాంట్ స్థానంలో పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తామని సరికాదన్నారు. . అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్, ఏసీపీ నాగేంద్రలు మాట్లాడుతూ కమిషనర్ సెలవు నుంచి వచ్చాక వివరిస్తామన్నారు. కగా పీజీఆర్ఎస్‌కు 9 అర్జీలు అందాయి, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల మేత భూమిని కాపాడండి

వెదురుకుప్పం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొటార్వేడు గ్రామ పంచాయతీ ఒత్తులూరు సమీపంలోనఇ పశువుల మేత భూమిని ఆక్రమించకుండా రెవెన్యూ అధికారులు చూడాలని తహసీల్దార్ నాగరాజుకు ఒత్తులూరు ఏడబ్ల్యు గ్రామస్తులు సోమవారం వినతిపత్రమిచ్చారు. చోటా నాయకుడు మేత భూమిని ఆక్రమించుకుంటున్నాడని తెలిపారు. ఆక్రమణలకు గురైతే పాడి పశువులను మేపుకోవడానికి వీలులేకుండా పోతుందన్నారు. చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నాగరాజు హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

వరద నీటితో ఇబ్బందులు



గ్రామస్తుల నిరసన

విజయపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వరదనీరు వస్తున్నా పట్టించుకోవడం లేదని క్షూరికాపురం ఆదిఆంధ్రవాడ వాసులు నీళ్లలో నిలబడి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నాలుగు రోజులుగా పొలాలలోని వరద నీరు తమ ఇళ్లలోని చొరబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వరద నీటి కాలువలు ఆక్రమణకు గురి కావడం వలన, చెత్తా చెదారం పేరుకొని పోవడం వలన నీరు ఇలా ప్రవహిస్తోందని వాపోయారు. అధికారులు స్పందించాలని జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కైలాసంయాదవ్ డిమాండ్ చేశారు.

వైసీపీ పాలనలో మద్యం సొమ్ము దోచుకున్నారు: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న చెంగల్రాయయాదవ్, నేతలు

వెదురుకుప్పం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మద్యం, గ్రావెల్, ఎర్రచందనం, సొమ్ము దోచుకుని నీతిమంతుల్లా నిరసనలు చేస్తున్నారంటూ మండల టీడీపీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్ ఎద్దేవా చేశారు. సోమవారం టీడీపీ ముఖ్య నాయకులు కార్వేటినగరం ఎక్సైజ్ పోలీసుస్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడారు. చెంగల్రాయయాదవ్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో కనీసం మద్యం కొనుగోలుకు ఫోన్ పే కూడా అనుమతించకుండా దోచుకొని ఇప్పుడు నిరసనలకు దిగడం దిగజారుడుతనమన్నారు. నాసిరకం మద్యం అమ్మకాలతో పేదల కిడ్నీలు పాడైపోయాయని గుర్తు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ మాదిరాజు జనార్దన్‌రాజు, తెలుగు యువత మండలాధ్యక్షుడు తోటి మురళీమోహన్, నాయకులు వి.రాజా, మేళం రవియాదవ్, చంద్రగిరి చెంగల్రాయులు,సోమశేఖర్, సంధాని, పొద్దుటూరు రాజా పాల్గొన్నారు.

పోలీసులపై అసత్య ప్రచారం చేస్తే చర్యలు తప్పవు : సీఐ

పూతలపట్టు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీసులపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ కృష్ణమోహన్ హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పూతలపట్టుకు చెందిన దినేష్ ఆదివారం మద్యం తాగి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తుంటే పోలీసులు అదుపులోకి తీసుకుని డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసి పంపారన్నారు. . అదేరోజు రాత్రి దినేష్ పోలీసుస్టేషన్‌కు వచ్చి సిబ్బంది పనులకు ఆటంకం కలిగిస్తే మరో కేసు నమోదు చేశారన్నారు. కానీ అతడు పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని సోషల్‌మీడియాలో పోస్టు పెట్టాడన్నారు.ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు తప్పవన్నారు.

18న పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో, జన విజ్ఞాన వేదిక నాయకులు

వెదురుకుప్పం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం విద్యా వనరుల కేంద్రం వద్ద సోమవారం చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను ఎంఈవో విజయకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఈనెల 18న, మండల స్థాయిలో నవంబరు 1న, జిల్లా స్థాయిలో నవంబరు 23న, రాష్ట్రస్థాయిలో డిసెంబరు 12 నుంచి 14వ తేదిల్లో చెకుముకి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు మునీంద్ర, వేణుగోపాల్‌రెడ్డి, కన్నయ్య, రామ్మోహన్ పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ

నగరి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఏకాంబరకుప్పం నందనార్‌స్వామి ఆలయంలో పంచభూత మహాయాగంలో భాగంగా సోమవారం గో పూజ నిర్వహించారు. 48 రోజుల పాటు ఈ యాగ పూజలు జరుగుతాయని యాగ నిర్వాహకులు తిరువియార్ రమేష్ స్వామి తెలిపారు. యాగ నిర్వాహకులు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

తాగునీటి వసతి కల్పించండి

పెనుమూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి సౌకర్యం కల్పించాలంటూ గొల్లపల్లి దళితవాడ మహిళలు వేడుకుంటున్నారు. ఎన్నో ఏళ్లగా తమ దళితవాడకు త్రాగునీరు లేదన్నారు. పక్కన ఉన్న పొలాల్లో వెళ్లి తెచ్చుకుటున్నామన్నారు. అధికారులు స్పందించి తాగు నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

వర్షాలకు కూలిన ఇంటిగోడలు



యాదమరి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గత రాత్రి కురిసిన భారీ వర్షాలధాటికి మండలపరిధిలోని జోడిచింతల వద్ద గల ఓ ఇంటి గోడలు తడిసి కూలిపోయాయి. ఇంట్లోని వస్తువులు దెబ్బతినడం వల్ల సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితురాలు రాధమ్మ రెవెన్యూ అధికారులకు విన్నవించారు. . నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని బాధితురాలు రాధమ్మ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.